జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ **వార్త** తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ **వార్త** తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

బుధవారం | 8-10-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 477 పేజీలు: 4 వెల : రూ.7





# బాబు కనుసన్నల్లోనే.. మద్యం దందా

*** పలాస నియోజకవర్గంలో ఆ ఒక్కడి చేతిలోనే 25 షాపులు * ఆ నలుగురు కమిటీ కుర్రోళ్లతోనే నిర్వహణ**
*** బెల్టులకు ఇక్కడి నుంచే మద్యం తరలింపు**
*** మామూళ్ల మత్తులో చోద్యం చూస్తున్న ఎక్సైజ్, పోలీసులు**

**శ్రీకాకుళం క్రైం, అక్టోబర్ 7 (వార్త):** నిబంధనల ప్రకారం మద్యం విక్రయించాలంటూ ప్రభుత్వం ఎన్ని నిబంధనలు అమలుచేస్తున్నా క్షేత్రస్థాయిలో అవి బుట్టదాఖలు అవుతున్నాయి. బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశాలు ఉన్నా అవి ఎక్కడ కూడా అమలు కావడం లేదు. పలాస కాశీబుగ్గలో ఓ రాజకీయ నేత అండదండలు ఉండడంతో పలువురు మద్యం వ్యాపారులు సిండికేట్ అయి అధిక ధరకు మద్యం విక్రయిస్తున్నా.. బెల్టుషాపులకు తరలిస్తున్నా.. కొందరు ఎక్సైజ్, పోలీసు అధికారులు మామూళ్ల మత్తులో మునిగి పట్టించుకోవడం మానేశారు. దీంతో మంచినీళ్లు కూడా దొరకని గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. పలాస నియోజకవర్గంలో సుమారు 25 వరకూ మద్యం షాపులు, బార్లు ఉన్నాయి. అవన్నీ కూడా ఓ టీడీపీ నేత ఆధ్వర్యంలోనే నడుస్తున్నాయి. వేలం పాటలో దక్కించుకున్న వారిని భయపెట్టి మరీ తన ఆధీనంలోకి తెచ్చుకుని మద్యం వ్యాపారమంతా తానే నడిపిస్తున్నాడు. మద్యం వ్యాపారులతో సిండికేట్ చేయించి ఓ నలుగురు కుర్రోళ్లతో మద్యం దందా వెనుకుండి చేయిస్తున్నాడు. ఈ బాబు గారు.. పెట్టిందే రేటుగా మారిందిక్కడ. నియోజకవర్గంలోని ఏ మూల బెల్టుషాపు పెట్టాలన్నా.. ఈ బాబునే సంప్రదించాలంట. బాబు కనుసన్నల్లోనే మద్యం షాపులతో పాటు బెల్టుషాపులు సైతం కొనసాగుతున్నాయంటే ఈ దందా ఏ మేరకు సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. నెలవారీ పోలీసు, ఎక్సైజ్ శాఖలకు మామూళ్లు వెళుతుండడంతో వారంతా సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోయారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ మద్యం సిండికేట్ వ్యాపారంలో టీడీపీ నేతలకు ఎవరెవరికి ఎంతెంత వాటా ఉందన్న దానిపై మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఇటీవల ఓ ప్రెస్‌మీట్‌లో పూసగుచ్చినట్టు వివరించారు. ఎంఆర్‌పీ కన్నా అధిక ధరలకు మద్యం విక్రయాలు చేస్తున్నారని, దీన్ని అరికట్టాలని పలాసకు చెందిన సామాజిక వేత్త మాన్యాల శ్రీనివాస్ సైతం సోమవారం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌తో పాటు కాశీబుగ్గ ఎక్సైజ్ సీఐకు వినతిపత్రం ఇచ్చారు. అయినప్పటికీ సంబంధిత అధికారుల్లో ఇంకా మత్తు వదల్లేదు కాబోలు పట్టించుకోలేదన్న గుసగుసలు వినిపించాయి.





# గ్రానైట్ కార్మికులపై.. పిడుగు





*** ముగ్గురు మృతి, మరో నలుగురికి గాయాలు**
*** రాజ్‌యోగా గ్రానైట్ క్వారీలో ఘటన * పిడుగు పాటా.. బ్లాస్టింగా అన్న అనుమానాలు* మెళియాపుట్టి మండలంలో గ్రానైట్ క్వారీల్లో పెరుగుతున్న మరణాలు**

**మెళియాపుట్టి, అక్టోబరు7 (వార్త):** మెళియాపుట్టి మండలంలోని గంగరాజుపురంలోగల రాజ్ యోగ్ గ్రానైట్ క్వారీలో ముగ్గురు కార్మికులు మృతి చెందగా, మరో నలుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. మంగళవారం సాయంత్రం పిడుగుపడడం వల్ల ఈ ఘటన చోటుచేసుకుందని క్వారీ నిర్వాహకులు చెబుతున్నారు. అయితే మరికొందరు బ్లాస్టింగ్ వల్లే ఈ దారుణం జరిగిందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రాజస్థాన్‌కి చెందిన మెగ్వాల్ హేమరేజ్(25), మధ్యప్రదేశ్‌కు చెందిన పింటూ (25), బిహార్‌కి చెందిన శ్రావణ్ కుమార్ (45) ఈ ఘటనలో మృతి చెందగా, టెక్కలికి చెందిన కాల జనార్దన్ రావు, ఒరిస్సా ఉదయగిరి బ్లాక్‌కి చెందిన జాన్ బోలిరో సింగ్, బందపల్లికి చెందిన కరణం బాలరాజు, పెదలక్ష్మీపురం గ్రామానికి చెందిన బైపోతు హరిప్రసాద్‌లు గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను టెక్కలి ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. తహసిల్దార్ పాపారావు, ఇన్చార్జ్ సబ్ ఇన్స్పెక్టర్ మధుసూదన్‌రావులు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా క్వారీ వద్ద పిడుగుపాటుతో ముగ్గురు కూలీలు మృతి చెందడం పట్ల రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర దిగ్భ్రాంతికి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. కాగా, ఇటీవల మెళియాపుట్టి మండలంలోని పలు గ్రానైట్ క్వారీల్లో వరుస ప్రమాదాలు జరుగుతున్నాయి. పలువురు కార్మికులు తమ ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చి పరామర్శించి వెళ్తిపోతున్నారే తప్ప క్వారీల్లో నిబంధనలు పాటిస్తున్నది లేనిది పెద్దగా పాటించడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

# టీడీపీ నేతలకే.. ఎరువులా?

*** వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి దుర్యోధనరావు**
*** వ్యవసాయాధికారులపై ఆగ్రహం * చినంచల గ్రామసచివాలయం ఎదుట రైతులతో కలిసి ధర్నా**

**పలాస, అక్టోబరు 7(వార్త):** టీడీపీకి చెందిన ప్రజాప్రతినిధులకే ఎరువులు పంపిణీ చేస్తున్నారని వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి, చినంచల ఎంపీటీసీ బమ్మిడి దుర్యోధనరావు మండల వ్యవసాయాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చినంచల గ్రామసచివాలయం వద్ద రైతులతో కలిసి మంగళవారం వైసీపీ నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా కోసం అన్నదాతలు అనేక అవస్థలు పడుతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్‌ల వద్ద రైతులు బారులు తీరుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి నేతలు చెప్పిన మోతుబారి రైతులకే ఎరువులు అందుతున్నాయని, చిన్నసన్న కారు రైతులకు అందడం లేదన్నారు. గత వైసీపీ పాలనలో ఎరువులు రైతులకు పుష్కలంగా అందాయన్నారు. ప్రస్తుతం రాష్ట వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నియోజకవర్గంలోనే రైతులు ఎరువుల కోసం ఆందోళనకు దిగుతున్నారన్నారు. తక్షణం రైతులకు ఎరువులు పంపిణీ చేయాలని లేకుంటే పలాస ఆర్డీవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని బమ్మిడి దుర్యోధనరావు ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**పలాస, అక్టోబరు 7(వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ సెంటర్లల్లో ఉపాధి శిక్షణ కోర్సులకు సంబంధించి ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఇందులో భాగంగా పలాస నియోజకవర్గ హబ్ పరిధిలో: డాక్టర్. వి. కణితీస్. ప్రభుత్వ ఐటిఐ నందు అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్ కోర్స్ ను ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ పైల జవహర్ , జిల్లా నైపణ్యాభివృద్ధి అధికారి ఉరిటి. సాయి కుమార్ ఒక ప్రకటనలో తెలయజేశారు. పదవ తరగతి ఆ పైన పాసైన విద్యార్హత కలిగి 18-35 ఏళ్ల లోపు వయసున్న స్త్రీలు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. కోర్స్ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్ల తో పాటు ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తారు. ఆశక్తి గల అభ్యర్థులు తమ సర్టిఫికేట్స్, ఆధార్ జెరాక్స్ మరియు 2 పాస్పోర్ట్ ఫోటోలు తో హాజరు కాగలరని తెలియజేశారు. వివరాల కోసం హబ్ కోఆర్డినేటర్ ఆర్ సోమేశ్వర రావు 6301046329 నంబర్ కు సంప్రదించాలని సూచించారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

**-రాయికోల సమీపాన సంఘటన**

**మందస, అక్టోబరు 7(వార్త):** లగేజీ వ్యాన్ ఢీకొని రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మందస మండలం రాయకోల గ్రామ సమీపాన మంగళవా రం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మందస మండలం తంగరపుట్టి గ్రామానికి చెందిన సవర విజయ్ (29) సెంట్రింగ్ పనులు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం తన సొంత పనులు నిమిత్తం బైక్ పై మందస వెళ్ళాడు. అనంతరం తన స్వగ్రామానికి బైక్ పై తిరుగు ముఖం పడుతుండగా రాయికోల గ్రామ సమీపాన ఎదురుగా వస్తున్న లగేజ్ వ్యాను వేగంతో ప్రమాదవశాత్తు ఢీకొంది. ఈ ఘటనలో సవర విజయ్ తీవ్ర గాయాల పాలయ్యాడు. క్షతగాత్రుడును 108 అంబులెన్స్ లో వైద్యం నిమిత్తం పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి విజయ్ మృతి చెందాడు. ఈ ఘటనపై మందస పోలీసులు కేసు నమోదు చేశారు.



## దసరా సెలవుల్లో విద్యార్థుల సృజనాత్మకత



**పలాస, అక్టోబరు 7(వార్త):** దసరా సెలవులలోసాధారణంగా స్కూల్ పిల్లలు సరదాగా గడపడం అనేది పరిపాటని ఒక్కప్పటి మాట. పలాస మండలం రామక్రిష్ణపురంలో ఉన్న శ్రీసత్యసాయి విద్యావిహార్ విద్యార్థిని విద్యార్థులు దీనికి బిన్నంగా ఆలోచించి సెలవులలో ఆట పాటలతో పాటుగా సమయాన్ని సృజనాత్మకంగా వినియోగించుకోవాలనే ఆలోచన వచ్చిందే తడువుగా, వారి వారి ఇళ్ల వద్దనే తల్లితండ్రుల సహకారంతో విశేషమైన ప్రాజెక్ట్ ను చార్ట్స్ రూపములో, మెటీరియల్స్ తో కూడిన నమూనాల రూపంలో తెలుగు, ఇంగ్లీషు, హిందీ, లెక్కలు, సోషల్, సైన్స్, మరియు ఇవిశ్ సబ్జెక్ట్స్ సంబంధించిన ప్రాజెక్టులును 300 మంది విద్యార్థిని విద్యార్థులు స్వయంగా తయారు చేసి మంగళవారం స్కూల్ ప్రాంగణములో ఎక్ష్బిట్ చేసి అందరినీ అలరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతి చౌదరి, ఉపాధ్యాయులు, మురళీ, సూర్యతేజ, అనుదీప్, లావణ్యకృష్ణా, జీవరత్నము, సాంబమూర్తి ప్రవీణ, మమతా మొదలగు ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు చిన్నబాడాం విద్యార్థుల ఎంపిక

**పలాస, అక్టోబరు 7(వార్త):** ఇటీవల శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజ్ గ్రౌండ్ నందు జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కు సంబంధించి పోటీలలో రాష్ట్రస్థాయి అండర్ 14 విభాగంలో అథ్లెటిక్స్ విభాగంనకు కూర్మపు ప్రణీత్, అండర్ 17 విభాగంలో త్రో బాల్ కు సవర్ ఆదిత్య ఎంపిక పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేసి అభినందించారు. వీరికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయురాలు టీ గీతను అందరూ కొనియాడారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు చింతాడ ఉషారాణి మాట్లాడుతూ క్రీడలు మనిషికి శారీరిక మానసిక ఆనందాన్నిస్తాయని.. తెలియజేశారు. రాష్ట్రస్థాయిలో కూడాను రాణించాలని క్రీడలను అందరూ ప్రోత్సహించాలని కోరారు. గ్రీన్ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో క్రీడలను



ప్రోత్సహించి. స్కూల్ స్థాయిలోనే సరైన తర్ఫీదు ఇచ్చినట్లయితే ఈ దేశానికి మంచి క్రీడాకారులని తయారు చేసే అవకాశం ఈ సమాజానికి మొత్తంకి ఉన్నదని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జి జగదీశ్వర్ రావు, వ్యాయామ ఉపాధ్యాయురాలు గీత, ఉపాధ్యాయులు గోవింద, షణ్ముఖరావు, నగేష్, లక్ష్మీపతి, ఉమామహేశ్వరరావు మన్మధరావు, జయలక్ష్మి, నిర్మల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జీఎస్టీపై మరింత అవగాహన పెంపొందించుకోవాలి



**మెళియాపుట్టి, అక్టోబరు 7(వార్త):** ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్ సేవింగ్స్ సూపర్ జిఎస్టి అనే అంశం పై ప్రతి ఒక్కరు మరింత అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల నోడల్ అధికారి శ్రీనివాస్ అన్నారు. మెళియాపుట్టి మండల కేంద్రంలో గల స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం నాడు సూపర్ సేవింగ్స్ సూపర్ జీఎస్టీ అనే అంశంపై విద్యార్థులకు నిర్వహించిన క్విజ్, వ్యాసరచన, డ్రాయింగ్ తదితర పోటీ కార్యక్రమలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్ సేవింగ్స్ సూపర్ జిఎస్టి కార్యక్రమం గురించి ప్రతి ఒక్కరూ మరిన్ని విషయాలను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని భవిష్యత్ లో ప్రతిదీ జీఎస్టీ పైనే ఆధారపడి ఉంటుందని అనేక అంశాలపై విద్యార్థులకు తెలియపరిచారు. ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలోనున్న18 పాఠశాలలో ఆరో తరగతి నుండి 10 తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించడం జరిగిందని, పోటీలు అనంతరం ప్రతి సచివాలయంలో నియమించబడిన జీఎస్టీ ఛాంపియన్స్ ఆఫీసర్స్ ద్వారా మొత్తం వివరాలన్నీ అప్లోడ్ చేయవలసి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వారితో పాటుగా మండల విద్యాశాఖ అధికారులు దేవేంద్రరావు, పద్మనాభం, ప్రధానోపాధ్యాయురాలు మహాలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## ఆశాల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

**పలాస, అక్టోబరు 7(వార్త):** తమ సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ కాశీబుగ్గ సూదికొండ, నర్సిపురం పిహెచ్సిల వద్ద మంగళవారం ఆశాలు భోజన విరామం సమయంలో నిరసన చేపట్టారు. కనీస వేతనాలు 26 వేలు చెల్లించాలని, జనాభా ప్రాతిపధికన ఖాళీలలో అశాలను నియమించాలని. సి హెచ్ డబ్ల్యూలకు ఆశాలతో సమానంగా సౌకర్యాలు, వేతనాలు చెల్లించాలని, రికార్డులు నిర్వహించడం ఆపాలని, దహనసంస్కారం ఖర్చులు 20 వేలు చెల్లించాలని, ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను పిహెచ్సి అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో వై.హేమలత, జ్యోతి, శ్రీదేవి లక్ష్మీకాంతం, పుణ్యావతి జీవన, లలిత, హేమావతి, రూప, సబితాపాత్రో, మీనా, జ్యోతి మహంతి, పుణ్యావతి, మంజు, యశోద,లక్ష్మి, సూది కొండ పి హెచ్ సి యం.లావణ్య, పి.పార్వతి, రాణి, జి.జ్యోతి, రజని, శ్రీదేవి, లలిత పాల్గొన్నారు.

## జిఎస్టి పోటీల విజేతలు వీరే



**ఇచ్ఛాపురం, అక్టోబరు7(వార్త):** జ్ఞానభారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ లోరాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ ఆదేశాల మేరకు నిర్వహించిన సూపర్ జీఎస్టీ 2.0 శీర్షికన వ్యాసరచన, చిత్రలేఖన పోటీల విజేత లను పాఠశాల కార్యదర్శి సీఈవో జోహార్ ఖాన్ ప్రకటించారు. 34 మంది విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారు. వ్యాసరచన పోటీలలో మొదటి మూడు బహుమతులను ఆసి ప్రియ , బాసి గగన శ్రీ, దుంప శృతిహాసిని గెలుచుకున్నారు. చిత్రలేఖన పోటీలలో మొదటి మూడు బహుమతులను పదవ తరగతికి చెందిన విద్యార్థినిలు డి సౌమ్యశ్రీ, సప్ప శ్రీజ, గిన్ని లాస్య గెలుచుకున్నారు. విజేతలకు అభినందనలు తెలియజేశారు. ఈ పోటీలను పాఠశాల ప్రిన్సిపాల్ ఐబి పండా పర్యవేక్షించారు. టి. బరంపురం పంచాయతీ లో ఉపాధిహామీ గ్రామ సభలో జి ఎస్ టి పై అవగాహనా ఇచ్చారు. కార్యక్రమం లో ఎంపిపి బోర పుష్ప,గ్రామ సర్పంచ్. త్రినాద్ రెడ్డి ,ఏ పి వో శ్రీనివాస్ ,సెక్రెటరీ కృష్ణ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రవీణ్ బాలకృష్ణ ఫీల్డ్ అసిస్టెంట్ సి ఎఫ్ లు మేట్లు వేతన దారులు పాల్గొన్నారు.

## పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి:



**కొత్తూరు, అక్టోబరు 7(వార్త):** ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వంశధారలో బారి వరద నీరు రావడంతో ఆ నదీ కి అనుకిని ఉన్న పంటపొలాల్లో నీరు నిల్వచేరి తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, వారికి నష్టపరిహారం అందించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యురాలు, మాజీ శాసనసభ్యురాలు రెడ్డి శాంతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం కొత్తూరు మండల వైస్సార్సీపీ నాయకులతో మండలంలోని మధనాపురం, సోమరాజపురం, ఆకులతంపర పంచాయతీల పరిధిలోని పలు గ్రామాల్లో దెబ్బతిన్న పంటపొలాలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వర్షాల వల్ల నష్టం వాటిల్లిన తీరును ఆమె రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులు పడిన కష్టం వృథా కావడం పట్ల ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం ఆమె మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం రైతుల కోసం ఈ-క్రాప్ నమోదు, పంటల బీమా (ఇన్సూరెన్స్) వంటి కనీస సౌకర్యాలు కూడా కల్పించలేదని విమర్శించారు. రైతులు కష్టపడి పండించిన పంటలు అకాల వర్షాల కారణంగా పూర్తిగా దెబ్బతిని తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి, దెబ్బతిన్న పంటలను అంచనా వేయించి, యుద్ధ ప్రాతిపదికన రైతులకు తగిన నష్టపరిహారం అందజేసి రైతులను ఆదుకునేందుకు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గండివలస ఆనంద్,చింతాడ సూర్యనారాయణ,సర్పంచ్ ధర్మ ,పూర్ణ ,హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## ధర్నాలు, ర్యాలీలు సమావేశాలు నిషేధం

**పలాస, అక్టోబరు 7(వార్త):** కాశీ బుగ్గ సబ్ డివిజన్ పరిధిలో ధర్నాలు, ర్యాలీలు సమావేశాలు నిషేధమని టెక్కలి డివిజన్ ఇంచార్జ్ డిఎస్పి లక్ష్మణరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలో 30 యాక్ట్ నేపథ్యంలో ఈనెల ఒకటవ తేదీ నుంచి 31 వరకు నిషేధమని తెలిపారు. ఎవరైనా సమావేశాలు, ధర్నా, ర్యాలీలు చేపడితే చట్టపరమైన పోలీస్ యాక్ట్ 30 ప్రకారం చర్యలు తీసుకుంటామని డి.ఎస్.పి హెచ్చరించారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## రైల్వే కన్సల్టెటివ్ కమిటీ నూతన కార్యవర్గం





**ఇచ్ఛాపురం, అక్టోబరు7(వార్త):** ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్ కన్సల్టెటివ్ కమిటీ నూతన కార్యవర్గాన్ని నియమించారు. ఈ మేరకు ఈస్ట్ కోస్ట్ రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రముఖ వ్యాపార వేత్త లు వల్లంపాటి కృష్ణ ప్రసాద్, దేవరపల్లి గోపాల రావు,బత్తుల తిరుమలరావు, ఉప్పాడ శంకర్ రెడ్డిని నియమించారు. ఖుర్దా డివిజన్ డి అర్ ఎం అలోక్ త్రిపాఠి,సీనియర్ డి సి ఎం అనిల్ కుమార్,లకు రైలు యూజర్స్ కమిటీ తరపున డి అర్ యు సి సి మెంబర్ కట్టా సూర్యప్రకాష్ రావు కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే ఏడాది డిసెంబర్ వరకు పదవీ కాలం ఉంటుందని చెప్పారు.




## జీఎస్టీపై ర్యాలీ, పోటీలు

**పలాస, అక్టోబరు 7(వార్త):** కేంద్రప్రభుత్వం ఇటీవల తీసుకున్న పన్ను సంస్కరణలలో జీఎస్టీ తగ్గింపు విషయమై పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పలాస పట్టణంలో మంగళవారం ర్యాలీ నిర్వహించి అవగాహన కలిగించారు. ఈ తగ్గింపు వలన చిన్న, మధ్యతరగతి వ్యాపారాలకు ప్రోత్సాహం లభిస్తుందని, ఆర్థిక వృద్ధి రేటు 2శాతం వరకూ పెరగొచ్చని, పేద, మధ్యతరగతి వర్గాలకు ఎంతో ప్రయోజనమని అధ్యాపకులు వివరించారు. ఈ విషయమై విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపల్ నరసింహమూర్తి మార్గదర్శకత్వంలో అధ్యాపకులు రామ్మోహన్ దొర, సరస్వతి, రమేష్, యుగంధర్, తపన్ కుమార్ జెనా, ప్రసాదరావు, జయప్రకాష్, ప్రవీణ్, సాగరిక, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు మధుర చరిత్రకారుడు కొండల మధుబాబు, వాసుదేవరావు, పాపారావు, వాలంటీర్లు ఇందులో భాగస్వాములయ్యారు.

## చీడపీడలకు నివారణ చర్యలు పాటించాలి




**కోటబొమ్మాళి, అక్టోబరు 7(వార్త):** వరిసాగులో చీడపీడలకు నివారణ చర్యలు తప్పని సరిగా పాటించాలని టెక్కలి వ్యవసాయ సహాయ సంచాలకులు జగన్మోహన్‌రావు అన్నారు. ఆయన మంగవారం మండల వ్యవసాయాధికారి ఎస్. గోవిందరావుతో కలిసి కోటబొమ్మాళి సచివాలయం పరిధిలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చీడపీడల నివారణ చర్యలు గూర్చి రైతులకు అవగాహన కల్పించారు. రైతులు రసాయన ఎరువులపైనే కాకుండా జీవన ఎరువులు వినియోగించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

## ఇంపాక్ట్ రీజనల్ ప్రెసిడెంట్‌గా చిరంజీవి




**ఇచ్ఛాపురం, అక్టోబరు7(వార్త):** ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, సైకాలజిస్ట్, ప్రపంచ శ్రేణి శిక్షకులు గంప నాగేశ్వరరావు వ్యవస్థాపించిన భారతదేశం తో పాటు పలు దేశాలలో కొనసాగుతున్న ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ రెండవ జాతీయ గవర్నింగ్ కౌన్సిల్ ( పాలకమండలి) సమావేశం విజయవాడలో జరిగింది. ఈ సమావేశానికి విశాఖపట్నం రీజియన్ ప్రెసిడెంట్ గా ( ప్రాంతీయ అధ్యక్షుడు) , జాతీయ పాలకమండలి సభ్యుని హోదాలో పల్లంటి చిరంజీవి ని నియమించారు. విశాఖపట్నం నుండి ఇచ్ఛాపురం వరకు రీజియన్ పరిధిలో నిర్వహిస్తున్న ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించినట్లు చెప్పారు. విశాఖపట్నం బీచ్ లో నిర్వహించిన బీచ్ క్లీనింగ్ కార్యక్రమాలు, ఇతర సమాజ హిత కార్యక్రమాలు, ఇచ్ఛాపురం క్లబ్ ఆధ్వర్యంలో వివిధ శిక్షణా కార్యక్రమాలు, ఇతర ప్రాంతాలలో నిర్వహించిన కార్యక్రమాలను వివరించారు. నిర్వహించిన కార్యక్రమాల పట్ల జాతీయ అధ్యక్షురాలు కె మాధవి ఆధ్వర్యంలో గవర్నింగ్ కౌన్సిల్ ప్రత్యేకంగా అభినందించి ప్రశంసలను అందించి సన్మానించారు. ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ ద్వారా ప్రభుత్వ పాఠశాలలు,కళాశాలల్లో మరిన్ని నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడానికి సమావేశంలో ప్రతిపాదించారు. ఈ సమావేశంలో జాతీయ కార్యదర్శి ఏ వెంకట్రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కే రామచంద్రుడు, కోశాధికారి గంప ఆదిత్య భరత్, తాజా మాజీ జాతీయ అధ్యక్షులు సోను శ్రీనివాస్, జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ ఆర్ వి ఆర్, గిరి ప్రసాద్ , హెడ్ బోర్డ్ సభ్యులు, ఆంధ్ర తెలంగాణ ప్రాంతీయ అధ్యక్షులు పాల్గొన్నారు.

## పారా బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా వాసికి మూడో స్థానం

**శ్రీకాకుళం, అక్టోబరు7(వార్త):** నైజీరియాలో గత నెల 30వ తేదీ నుంచి జరి గిన పారా బ్యాడ్మింటన్ పోటీల్లో మన దేశం తరఫున పాల్గొన్న జిల్లా వాసి సతివాడ హిమ రాజశేఖర్ మూడో స్థానం దక్కించుకున్నారు.




# సీజనల్ వ్యాధులపై పకడ్బందీ చర్యలు

**-కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**




**శ్రీకాకుళం, అక్టోబరు7(వార్త):** ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో ప్రజారోగ్యంపై జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రత్యేక దృష్టి సారించారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, డయేరియా కేసులను నివారించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో ఎక్కడా నీరు నిలువకుండా చూడాలని, కాలువల శుభ్రపరిచే పనులను నిరంతరం కొనసాగించాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి కలెక్టర్ మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల అధికారులతో వివిధ శాఖల పురోగతిపై సమీక్ష నిర్వహించారు.

**ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత :**

ప్రజల ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, తాగునీటి నమూనాలను త్వరితగతిన పరీక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. వర్షాలతో నీరు నిలువ ఉన్న దృష్ట్యా, రానున్న వారం రోజుల పాటు ప్రజలు కాచి చల్లార్చిన నీటినే తాగేలా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు చేతి శుభ్రత, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై సంపూర్ణ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఇప్పటికే జిల్లాలోని 159 హాస్టల్స్‌ను తనిఖీ చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు.

**పంట నష్టంపై నివేదికకు ఆదేశం**

భారీ వర్షాల కారణంగా జిల్లాలో 16 మండలాల్లో పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ముఖ్యంగా సంతబొమ్మాళిలో 400 హెక్టార్లు, పాతపట్నంలో 250 హెక్టార్లు, కొత్తూరు, హిరమండలంలో 100 హెక్టార్ల చొప్పున నష్టం సంభవించినట్లు పేర్కొన్నారు. ధాన్యం మొలకెత్తడం, ధాన్యం పొట్టు దశలో నీరు చేరడం, పూత వాష్ ఔట్ అవ్వడం వంటి నష్టం జరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ పంట నష్టంపై తక్షణమే ప్రభుత్వానికి సమగ్ర నివేదిక పంపిస్తామని కలెక్టర్ తెలిపారు. పంట నమోదు గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే పరిపాలన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేస్తూ, ప్రతి అధికారి ప్రజా సానుకూల దృక్పథంతో క్షేత్రస్థాయిలో కృషి చేయాలని, ప్రజా సేవల్లో ఫలితాలు కన్పించేలా పనిచేయాలని ఆదేశించారు. పెండింగ్ అంశాలను వేగంగా పరిష్కరించాలన్నారు. అరసవల్లి దేవస్థానం భక్తులకు అందించిన సేవల్లో ఈ వారం రాష్ట్రంలో ప్రథమ స్థానం లభించడం పట్ల కలెక్టర్ అభినందించారు. ఇంజినీరింగ్ పనుల్లో పూర్తయిన వాటికి బిల్లులు పెండింగ్‌లో ఉంచితే సహించేది లేదని హెచ్చరించారు. ఉద్యోగులంతా ఐ గాట్ కర్మయోగి కోర్సులను గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

**జీఎస్టీ ప్రచారం**

ఇంటింటికీ జీఎస్టీ ఫలాలపై ప్రచారంలో పురోగతిపై కలెక్టర్ సమీక్షించారు. జీఎస్‌డబ్ల్యూఎస్ టీమ్, ఎస్‌హెచ్‌జీలు, వీఓలు ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తూ, నిత్యావసర వస్తువులపై వినియోగదారులకు లభించే విలువను వివరించాలని సూచించారు. నెల రోజుల పాటు నిర్వహించనున్న జీఎస్టీ ఉత్సవాల్లో లోటుపాట్లు లేకుండా చేయాలని ఆదేశించారు. ప్రజలకు ప్రయోజనం చేకూరేలా సేవల నాణ్యతను పెంచడమే తమ లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు.

సమావే శంలో అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్ జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, ప్రత్యేక ఉప కలెక్టర్లు బి. పద్మావతి, జయదేవి, ఇతర శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

# వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు మానుకోవాలి



**పలాస, అక్టోబరు 7(వార్త):** వైసీపీ పార్టీ నాయకులు అసత్య ప్రచారాలు మానుకోవాలని పలాస మండల రూరల్ తెలుగుదేశం నాయకులు ముక్తకంఠంతో కోరారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు మానుకొని ఎరువులు, పథకాలపై దూసప్రచారం చేస్తే కూటం ప్రభుత్వానికి మంచి జరుగుతుంది కానీ, చెడు జరగదని పిత్తవు పలికారు. స్థానిక నాయకులు గానీ, ఎంపిటిసి గాని సర్పంచ్ని చూసి నేర్చుకోవాలని హితబోధ చేశారు. పార్టీలకు అతీతంగా దగ్గరుండి అన్ని పార్టీలను సర్పంచ్ యూరియా బస్తాలు సరఫరా చేస్తున్నారని చెప్పారు. సర్పంచ్ చూసి నేర్చుకోవాలని, లేకుంటే రాజకీయంగా భూస్థాపితం అవుతుందని, చివరి ఎన్నికలు నీకు అవుతాయని హెచ్చరించారు. రైతులకు సెంటు భూమి కూడా లేదని, అలాంటి వారిని తీసుకొచ్చావని, నీవు తీసుకొచ్చిన రైతులకు భూముంటే నా భూమి ప్రజలకు రాసిస్తారని టిడిపి నాయకుడు తమ్మినేని గంగారం స్పష్టం చేశారు. చిన్నంచాల గ్రామంలో కొంతమంది రాజకీయ నాయకులు పేరు చెప్పి పిచ్చెక్కి మాట్లాడుతున్నారని, కూటం ప్రభుత్వం పై బురదజల్లే పనిని, చిన్నంచాల పంచాయతీ పరిధిలో 1020 ఎకరాల విస్తీర్ణం ఉంది. దానికి సరిపడే750 బస్తాలు రైతులకు పంపిణీ చేశామని, స్లిప్పులతో సహా అందజేయడం జరిగిందని చెప్పారు. పలాస గ్రోమోర్ సెంటర్లో ఇచ్చిన లిస్టు బహిర్గతం చేశారు. కూటమి ప్రభుత్వంపై బురద జల్లేపని మానుకోవాలని, వైసీపీ నాయకులకు యూరియా అందలేదని ప్రశ్నించారు. గ్రామంలో పుట్టుకతో వైసీపీ అభిమాని పిల్లి రాముకు యూరియా బస్తాలు అందాలేదాని ప్రశ్నించారు. డప్పులు కొట్టుకొని రాజకీయాలు చేయాలంటే చేయండి అని, మేము యూరియా బస్తాలు ఇవ్వలేదని నిరూపించాలని సవాలు చేశారు. రాజకీయాలు చేసి ఏదో ఒకటి చేస్తామని ప్రయత్నిస్తే వాటికి పూర్తిస్థాయిలో సమాధానం చెప్పే రోజు త్వరలోనే వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు తమ్మినన గంగారాం, అరియపల్లి ప్రభుదాసు, పినకన తిరుమల రావు, పైల విష్ణు మూర్తి, గుంట ధర్మ రావు, కంచరాన జగన్, చాపరా తిరుపతి, కాశీ మార్కండేయులు, కంచరాన మధు, బమ్మిడి సురేష్,బొచ్చ నాగు, సత్తారు సురేష్, కూన రామయ్య ,కిల్లి రమణ గ్రామ రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి



**శ్రీకాకుళం, అక్టోబరు7(వార్త):** భారతీయ సాహిత్యానికి మొట్టమొదటి సంస్కృత ఇతిహాసం రామాయణాన్ని రచించి భారతీయ సాహిత్యానికి 'ఆదికవి' గా ఆద్యుడుగా మహర్షి వాల్మీకి, కీర్తింపబడినారని అదనపు ఎస్పీ కెవి రమణ పేర్కొన్నారు.మంగళవారం మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా శ్రీకాకుళం జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీలు కెవి రమణ, పి శ్రీనివాసరావు మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా నేటి యువత మహర్షి ఆలోచనల నుండి స్ఫూర్తి పొంది సత్యనిష్ఠ, కర్తవ్యబద్ధతతో జీవించవలసిన అవసరం ఉందని అదనపు ఎస్పీలు పిలుపునిచ్చారు.మహర్షి వాల్మీకి గారి జీవితం మన అందరికీ ప్రేరణామూర్తి అని,సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొల్పడం కోసం ఆయన చూపిన మార్గాన్ని అనుసరించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శేషాద్రి, ఏవో గోపినాథ్, సీఐ శ్రీనివాస్, అర్ఐలు నరసింగరావు,క్రిష్ణ ప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొని మహర్షి వాల్మీకి ఘనంగా నివాళులర్పించారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక





## నేడు శ్రీకాకుళంలో జాబ్ మేళా

**శ్రీకాకుళం, అక్టోబరు7(వార్త):** శ్రీకాకుళంలో బుధవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నామని మెప్మా పిడి వెంకటరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మెప్మా, శ్రీకాకుళం ఆధ్వర్యంలో నిపుణ సంస్థ వారి ద్వారా శ్రీకాకుళం పట్టణంలోని స్థానిక బాపూజీ కళామందిర్‌లో ఈ నెల 8వ తేదీన 15 కంపెనీలతో జాబ్ మేళా కార్యక్రమం నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమమునకు స్టేట్ మిషన్ డైరెక్టర్, ఏ.పి.మెప్మా, గుంటూరు నుండి ఎన్. తేజ్ భరత్, స్థానిక శాసన సభ్యులు గొండు శంకర్ హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమమునకు జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలలోని మహిళా సంఘాల సభ్యులు లేదా వారి యొక్క సంబందికులైన నిరుద్యోగ యువత దాదాపు 1200 మంది వరకు హాజరవటం జరుగుతుందన్నారు. ఇందులో కనీసం 1000 మందివరకు ఉపాది కల్పించటమే ధ్యేయంగా 15 కంపెనీలు ప్రణాలికలు సిద్ధం చేయటం జరిగిందని, ఈ కార్యక్రమమునకు 5 రోజుల ముందు నుండి మెప్మా సిబ్బంది జిల్లాలోని మున్సిపాలిటిలలో నిరుద్యోగ యువత ను ఆన్ లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయటం జరుగుతుందని వివరించారు. జాబ్ మేళా రోజు కూడా స్పాట్ రిజిస్ట్రేషన్ కు అవకాశం ఉన్నదని, ఈ కార్యక్రమమునకు నేరుగా హాజరై సద్వినియోగం చేసుకోవలసినదిగా మెప్మా పిడి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## విద్యార్థులు లక్ష్యంతో చదవాలి

**-ఆహార నాణ్యతలో రాజీ పడకూడదు**

**- రాష్ట్ర ఆహారకమిషన్ చైర్మన్ విజయప్రతాప్ రెడ్డి**

**శ్రీకాకుళం/ఎచ్చెర్ల/లావేరు,ఆమదాలవలస,అక్టోబర ు7(వార్త):** మధ్యాహ్న భోజన పథకంలో ఆహార నాణ్యతలో రాజీ పడకూడదని రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం శ్రీకాకుళం అర్బన్, ఎచ్చెర్ల, లావేరు, ఆమదాలవలస మండలాల్లో ఆయన పర్యటించారు. శ్రీకాకుళం అర్బన్ హయాత్ నగర్, నీలంకాలనీ, వరం వీధిలో రేషన్ డిపో, అంగన్వాడీ కేంద్రాలను, ఎచ్చెర్ల మండలంలో అంగన్వాడి కేంద్రం, పోలీస్ క్వార్టర్స్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, డా. బి.ఆర్ అంభేధ్కర్ గురుకులం(బాలికలు), లావేరు మండలంలో అల్లినగరం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్వాడి కేంద్రం, మురపాకలో కస్తూరి గాంధీ బాలికా విద్యాలయాల ను ఆమదాలవలస మహాత్మాగాంధీ పూలే వసతీ గృహాన్ని, తిమ్మాపురం వద్ద జగ్గుశాసనపేట వద్ద గల కెజిబివిలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్ణయించుకొని చదవాలన్నారు. అన్నింటికీ చదువే మూలమని, ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను సక్రమంగా అర్థం చేసుకుని, మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. మంచి ఉద్యోగంలో స్థిరపడితే తల్లిదండ్రులకు మీ తరుపున అదే మంచి బహుమతి అవుతుందన్నారు. ప్రస్తుతం అంతా డిజిటల్ యుగం నడుస్తున్నదని, మనం కూడా కాలానికి అనుగుణంగా మారాలన్నారు. మనసుంటే మార్గం ఉంటుందని, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి



వెళ్లేందుకు కృషి చేయాలన్నారు. ప్రస్తుతం మీరందరూ రాష్ట్ర భవిష్యత్తుకు ఒక సంపదన్నారు. భవిష్యత్తులో కలెక్టర్లు డాక్టర్లు, ఏ వృత్తిలో స్థిరపడిన ధర్మం, నీతి, నిజాయితీతో ప్రజలు దగ్గర మెలిగి, ప్రజల యొక్క మనస్సును గెలుచుకోవాలన్నారు. మనలో నైపుణ్యం ఉంటే భవిష్యత్తులో మంచి వృత్తిలో ఉంటామని విద్యార్థులనుద్దేశించి పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పలు చోట్ల పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. భోజనం చేసి వంటకాలను రుచి చూసి, మెనూ అమలు సక్రమంగా జరుగుతోందని సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పోర్టిఫైడ్ రైస్‌లో విద్యార్థులకు అవసరమైన విటమిన్లు, ఖనిజాలు లభిస్తాయని తెలిపారు. గంజి వడబోయకుండా వండాలన్నారు. అంగన్వాడి కేంద్రాలు, పాఠశాలలు సమర్థవంతంగా పనిచేస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా, పోషణ రంగాల్లో నాణ్యతపై అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఫిర్యాదులు వచ్చినచో సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. అంగన్వాడి కేంద్రాలు, పాఠశాల స్టాక్ పాయింట్ లో ఉన్న సరుకుల నిల్వలు, రిజిస్టర్ల నిర్వహణ, సక్రమంగా ఉన్నవీ లేనిదీ తనిఖీ చేశారు. ఈ పర్యటనలో జిల్లా పౌర సరఫరాల అధికారి గుంట సూర్యప్రకాశ్ రావు, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు డి. మధుసూదనరావు, జిల్లా విద్యాశాఖ అధికారి ఎ. రవిబాబు, డి సి ఓ వై. యశోదలక్ష్మి, తూనికలు, కొలతల శాఖ అధికారి బలరామకృష్ణ, ఆహార భద్రత అధికారి లక్ష్మీ, పౌర సరఫరాల డి టి అనిల్ కుమార్, ఎచ్చెర్ల సి డి పి ఓ పాల్గొన్నారు.




## జిఎస్‌టిపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు

**ఇచ్ఛాపురం, అక్టోబరు7(వార్త):** మండలంలోని అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో సూపర్ జి ఎస్ టి 2.0 పై ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యాసరచన మరియు చిత్రలేఖనం పోటీలు విద్యార్థులకు నిర్వహించారు.విద్యార్థుల్లో మరియు సమాజంలో జి ఎస్ టి వినియోగము మరియు వినిమయంపై చర్చ గోష్టి నిర్వహించారు. ప్రతి ఉన్నతపాఠశాలలోనూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయం సిబ్బంది కూడా పాల్గొన్నారు . మండల విద్యాశాఖ అధికారులు కురమాన అప్పారావు, విశ్వనాథం పర్యవేక్షణ చేసి జీఎస్టీ పై అవగాహన కల్పించారు. వ్యాసరచన మరియు చిత్రలేఖనం పాల్గొన్న విద్యార్థులను ఇరువురి ఎంఈఓ లు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎం ఆర్ సి సిబ్బంది మరియు సి ఆర్ ఎం టిలు పాల్గొన్నారు.కొలిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ ఎం నరేంద్ర పట్నాయక్ ఆధ్వర్యంలోపోటీలు జరిగాయి. కస్తూరిబా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పొన్నాడ శిరీష ఆధ్వర్యంలో వీధుల్లో జీఎస్టీ పై అవగాహన ర్యాలీలు నిర్వహించారు పాఠశాల విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

## బీసీ హాస్టల్‌లో ఆకస్మిక తనిఖీ



**లావేరు, అక్టోబరు7(వార్త):** విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రతకు ఎల్లప్పుడూ ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. హరిబాబు చెప్పారు. లావేరు ప్రభుత్వ బీసీ (బాలుర) హాస్టల్‌ను మంగళవారం ఆకస్మికంగా సందర్శించిన ఆయన హాస్టల్ గదులు శుభ్రంగా ఉంచేలా చూడాలని, ప్రభుత్వం నిర్ధేశించిన దినవారీ ఆహార పట్టిక ప్రకారం విద్యార్థులకు ఆహారం అందించాలని వార్డెన్‌కు సూచించారు. విద్యార్థుల సమస్యలను తెలుసుకొని అవసరమైన న్యాయసహాయం అందించడానికి మార్గదర్శకాలు కూడా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ జి. ఇంద్ర ప్రసాద్, వార్డెన్ జె. రమేష్ బాబు పాల్గొన్నారు.

## సీజేఐ గవాయ్‌పై దాడి దురదృష్టకరం

**- ముక్తకంఠంతో ఖండించిన దళిత-ఆదివాసీ-బహుజన-మైనార్టీ సంఘాల నేతలు**

**- శ్రీకాకుళంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపిన నాయకులు**

**- సంఘీభావం తెలియజేస్తూ నిరసనలో పాల్గొన్న శ్రీకాకుళం బార్ అసోసియేషన్ న్యాయవాదులు**

**శ్రీకాకుళం, అక్టోబరు7(వార్త):** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ గవాయ్ పై దాడి యత్నాన్ని ఖండిస్తూ శ్రీకాకుళంలో దళిత-ఆదివాసి-బహుజన-మైనార్టీ సంఘాల నేతలు మంగళవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీకాకుళంలోని అంబేద్కర్ జంక్షన్ వద్దకు చేరుకున్న దళిత,ఆదివాసీ,బహుజన,మైనార్టీ నాయకులు దాడి ఘటనను దురదృష్టకర సంఘటనగా పేర్కొంటూ మానవహారాన్ని నిర్వహించారు. దళిత-ఆదివాసి-బహుజన-మైనార్టీ సంఘాల జెఏసి నేతలు తైక్వాండో శ్రీను,డాకంత వేణుల ఆద్వర్యంలో చేపట్టిన ఈ నిరసన కార్యక్రమంలో శ్రీకాకుళం బార్ అసోసియేషన్ న్యాయవాదులు కూడా పాల్గొని సంఘీభావాన్ని తెలియజేసారు. సీజేఐపై దాడికి పాల్పడ్డ నిందితుడుని కఠినంగా శిక్షించాలని,భవిష్యత్ లో ఇటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసారు. తొలుత బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి వారంతా పూలమాలలు వేసి నివాళుళులర్పించారు. అనంతరం సీజేఐ గవాయ్ పై దాడి యత్నాన్ని ఖండిస్తూ నిరసన తెలియజేసి మానవహారం నిర్వహించారు. అనంతరం దళిత-ఆదివాసి-బహుజన-మైనార్టీ నాయకులు డా.కంఠ వేణు,బడే కామరాజు,ముంజేటి కృష్ణ, బాడాన దేవభూషణ రావు,రౌతు శంకర్ రావు,ఎం.ఏ రఫి,మహిబుల్లా ఖాన్ లతో పాటు జిల్లా బార్ అసోసియేషన్ కార్యదర్శి పిట్ట దామోదర్ రావు,ఉపాధ్యక్షులు సీతరాజు,ప్రతినిధులు బి.మురళీకృష్ణ, జె.శ్రీనివాసరావు,చలపతిరావు, డి. రాజ్ కుమార్ లు మాట్లాడుతూ సీజేఐ గవాయ్ పై




దాడి యత్నాన్ని ఖండించారు. ఈ సంఘటన న్యాయవ్యవస్థపై జరిగిన దాడిగానే అభివర్ణించారు. ఇటువంటి చర్యలు ప్రమాధకరమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య,నాగరిక సమాజంలో దాడులకి స్థానం లేదన్నారు.ఈ నిరసన కార్యక్రమంలో దళిత-ఆదివాసి-బహుజన-మైనార్టీ నాయకులు వైశ్యరాజు మోహన్, నటుకుల మోహన్ ,యజ్జల గురుమూర్తి, అర్జి కోటి, పురుషోత్తం రాంబాబు,సంతు,అర్జి ఈశ్వరరావు,కొయిలాపు విజయ్ , కొత్తూరు సత్యన్నారాయణ ,పెయ్యల చంటి, అబ్బాస్ ,విజయ్ ,అఖిల్ ,రాము ,మజ్జి గౌతమ్ ,రాహుల్ ,హేమంత్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## జి.ఎస్.టి.పై అవగాహన



**ఎల్ఎన్ పేట, అక్టోబరు7(వార్త):** లక్ష్మీనర్సుపేట గ్రామంలో గల మోడల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ప్రభుత్వం ఆదేశాల మేరకు జి.ఎస్.టి పై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సర్వీస్ ఛైర్పర్సన్‌బీదివ్యాంగ ఉద్యోగ సంఘం రాష్ట్ర నాయకుడుబీ సామాజిక వేత్తబీ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతబీ బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కార్యదర్శిబీ సక్షం జిల్లా కార్యదర్శిబీ గురు దేవా ఛారిటీ బుల్ ట్రస్ట్ ప్రతినిధి లయన్. డా.ఎం.కె.మిశ్రోబీ ప్రధానోపాధ్యాయులు బి.రమాదేవిబీ ఉపాధ్యాయులు ఎన్.రామారావుబీపి.లక్ష్మణరావుబీటి.ఉపేంద్రబీ విద్యార్ధి -విద్యార్ధినీలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వక్తలు జి.ఎస్.టి మరియు ఇటీవల కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జి.ఎస్.టి.రేట్ల గూర్చి అవగాహన కల్పించారు.

## యోగాతో మానసిక ఆరోగ్యం



**నరసన్నపేట, అక్టోబరు7(వార్త):** ప్రతీ రోజూ యోగా చేయడం వలన మానసిక ఆరోగ్యం కలుగుతోందని డిస్ట్రిక్ట్ కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ పి. రాజశేఖర్ తెలిపారు. ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాలు సందర్భంగా మంగళవారం నరసన్నపేట మండలం సత్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ ధ్యానం, యోగా ప్రతిరోజూ చేయడం వల్ల మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని తెలియజేశారు. పాఠశాల యోగా ఇన్స్ట్రక్టర్ టి.అప్పన్న విద్యార్థులతో యోగా, ధ్యానం చేయించారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో మానసిక ఆరోగ్య కౌన్సిలర్లను నియమించడం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అక్టోబర్ 10వ తేదీన ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో మానసిక ఆరోగ్య వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.వకుళ రత్నమాల, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## వాల్మీకికి ఘనంగా నివాళులు

**శ్రీకాకుళం, అక్టోబరు7(వార్త):** మహర్షి వాల్మీకి చిత్రపటానికి జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు ఘనంగా నివాళులర్పించారు. మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ముందుగా జ్యోతి వెలిగించిన అనంతరం మహర్షి వాల్మీకి చిత్రపటానికి మంగళవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాణ రచయితలను భగవత్ సమానులుగా కొలుస్తారన్నారు. భగవంతుడే వాల్మీకిమహర్షిగాను (బ్రహ్మ), వేదవ్యాసుడు (శ్రీ మహావిష్ణువు) గాను జన్మించి పురాణములను రచించినారని, అవి విశ్వమానవ సౌభ్రాతత్వమును చాటుతాయని నమ్ముతారని వివరించారు. భారతదేశంలో పురాణంలను అనగా జరిగిపోయిన వాస్తవాలను (చరిత్రలను) కాలక్షేపానికో, పుణ్యానికో చదవటము, వినటము అలవాటుగా వస్తోంది. పురాణాలంటే భారతీయులకు అత్యంత విశ్వాసమని చెప్పారు. పురాణాలలోని వ్యక్తుల జీవితకథలను, అందులోని నీతి, నిజాయతీలను, సంఘటనలను నిజమనే నమ్ముతారన్నారు. రామాయణంపై ఆయన సుదీర్ఘంగా వివరించారు. బిసి సంఘం నాయకులు ప్రగడ వెంకన్న మాట్లాడారు. నివాళులు అర్పించిన వారిలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు తో పాటు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారిణి అనురాధ, కలెక్టరేట్ పరిపాలనాధికారి జి.ఎ.సూర్యనారాయణ, బిసి సంఘ నాయకులు ఉన్నారు, ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో డి. సత్యనారాయణ, సెట్విస్ సిఈఓ అప్పలనాయుడు, పిజిఆర్ఎస్



సూపరింటెండెంట్ ప్రవళిక, బిసి కుల సంఘ నాయకులు ఆంధ్రప్రదేశ్ బొందిలి సంఘం, శ్రీకాకుళం పి. సురేష్ సింగ్, ఘనపతి ఆచారి, కలెక్టరేట్ ఆయా విభాగాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546